# శ్రీ షిరిడీ సాయి ఏకాదశ స్తోత్రమ్

పరమావధి! పావన దైవిక లోకబంధో!
శరణాగత ఆర్త సుపాలయ ప్రేమసింధో!
కరుణాలయ! భక్త భారభృత భుజస్కంధో!
శ్రీ సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 1

తాత్పర్యం: ఓ పరమావధి (పరమ + అవధి; ఉత్తమ స్థానం); ఓ దైవాంశ సంభూత లోకబంధువా! సర్వశ్య శరణాగతి అన్నవారలను చక్కగా పాలించే ప్రేమమూర్తీ! కరుణామూర్తీ! భక్తుల భారాలని భుజాలమీద వేసుకునే వాడా! ఓ శ్రీ సాయినాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

యోగీశ్వరేశ్వర గుణాత్మక నిర్గుణాయ!
జ్ఞానామృతత్వ పరిశోధక పోషణాయ!
నిత్యాగ్నిహోత్ర నిరవధిక సుభాషణాయ!
హర సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 2

తాత్పర్యం: ఓ యోగీశ్వరేశ్వరా! నిర్గుణాత్ముడవై కూడా గుణాలని చూపువాడా! జ్ఞానాన్ని పొందాలనుకొనే పరిశోధకులను పోషించువాడా! నిరవధికంగా అగ్నిహోత్రం జరుపుతూ, మంచిమాటలే చెప్పేవాడా! ఓ హర సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

సమర్థ సద్గురు బిరుదాంక శోభితాయ!
క్షమతాగుణ సర్వకాల ప్రదర్శకాయ!
క్రమమార్గ విచక్షణాజ్ఞాన బోధకాయ!
గురు సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 3

తాత్పర్యం: సమర్థ సద్గురు బిరుదుతో శోభిల్లువాడా! ఎల్లప్పుడూ క్షమాగుణాన్ని ప్రదర్శించువాడా! సక్రమమార్గాన్ని, విచక్షణాజ్ఞానాన్నీ బోధించేవాడా! ఓ గురు సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

ఏకేశ్వర సూక్తి నిరంతర పారాయణాయ!
సకల జీవేశ్వర సమానత నిరూపణాయ!
లోకాది వందిత యోగేశ్వర పూజితాయ!
శివ సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 4

తాత్పర్యం: అందరికీ దేవుడు ఒక్కడే అని నిరంతరం పారాయణ చేసేడివాడా! అన్ని జీవులలోని ఆత్మలు సమానమని నిరూపించినవాడా! లోకంలో పొగడబడిన వివిధ యోగేశ్వరులతో పూజింపబడినవాడా! ఓ శివ సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

నవదైవ స్వరూప మానుష జన్మణాయ!
నవనీత హృదయ నిష్కల్మష మానసాయ!
భవదీయ భక్తహృత్కమల వాసితాయ!
భవ సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 5

తాత్పర్యం: మనిషి జన్మనెత్తిన ఓ కొత్త దైవస్వరూపా! వెన్నతో పోల్చగల నిష్కల్మషమైన మనసు కలవాడా! నీ భక్తుల హృదయాలలో నివసించేవాడా! ఓ భవ సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

నిరతాన్నదాన వైషిష్ఠ్యత సూచనాయ!
వేదాంతజ్ఞాన సూక్ష్మార్ధ బోధితాయ!
మతసామరస్య నిరూపక జీవితాయ!
హరి సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 6

తాత్పర్యం: ఎప్పుడూ అన్నదానాలని చెయ్యవలసిన విషిష్ఠ్యతని, ప్రాముఖ్యతని వివరించినవాడా! వేద వేదాంతాలలోని గూఢ, సూక్ష్మార్ధాన్ని తెలుసుకొనే అర్హత ఉన్న భక్తులకు చక్కగా బోధించినవాడా! సర్వమత సామరస్యాన్ని నిజజీవితంలో నిరూపించినవాడా! ఓ హరి సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

దక్షిణ రూపేణ బంధ విమోచనాయ!
అక్షర కృపాకటాక్ష విలోచనాయ!
సంక్షోభ రోగనివార సుభేషజాయ!
రామ సాయినాథ చరణం మమ శరణుశరణం ॥ 7

తాత్పర్యం: భక్తినీ, ధనాన్నీ నీ భక్తుల దగ్గరనుంచీ దక్షిణ రూపంలో అడిగి ఆ భక్తులను ఋణబంధాలనుంచి విముక్తి చేసేవాడా! ఎప్పుడూ తరిగిపోని కృప, కటాక్షములు వర్షించే కనుచూపుగలవాడా! ఎంత క్షోభ కలిగించే

రోగాలనైనా మంచి మందు (చేతి స్పర్శ, ఊదీ) ఇచ్చి తగ్గించగల వైద్యుడా! ఓ రామ సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

అతి సులభమార్గ బోధన ప్రేరితాయ!
అతి నియమనిష్ఠా సాధన ప్రవృత్తాయ!
అతి భక్తవాత్సల్య పూరిత దర్శనాయ!
అల్లా సాయినాథ చరణం మమ శరణుశరణం ‖ 8

తాత్పర్యం· నీ భక్తుల బాధలుకానీ, అనుమానాలనికానీ, వారికి నేర్పవలసిన పాఠాలనికానీ, గుణపాఠాలనికానీ, వారికి తేలికగా అర్థం అయ్యేలా, దృష్టాంతాలతో సులభమార్గంలో బోధపడేటట్లు ప్రేరణ కలిగించువాడా! నియమ నిష్ఠల సాధనతో చరించువాడా! నీ భక్తులమీద ప్రేమాభిమానాలతో కూడుకుని దర్శనమిచ్చువాడా! ఓ అల్లా సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

జితేంద్రియాయ! పంచభూతేశ్వరాయ!
నిత్య సర్వస్య కాలజ్ఞానరూపాయ!
చతురోపాయ మార్గప్రదర్శకాయ!
త్వం సాయినాథ చరణం మమ శరణుశరణం ‖ 9

తాత్పర్యం· శరీరంలోని ఇంద్రియాలను జయించినవాడా! పంచభూతాలను శాసించగలవాడా! ఎల్లప్పుడూ, అన్ని చోటలా, ఎక్కడ ఏమి జరుగుతోందో, జరిగిందో, జరగబోతోందో, ఏ జీవి ఆలోచనలు ఎలా ఉన్నయ్యో, ఎలా ఉండేవో, ఎలా ఉంటయ్యో తెలిసిన కాలజ్ఞాన స్వరూపుడా! సామ, దాన, భేద, దండోపాయాలతో నీ భక్తులకు సరి అయిన మార్గాలని చూపించేవాడా! ఓ సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

ఖండ యోగాసన సామర్ధ్యమూర్తే!
ఖండోబా యశోదయ నామధార్తే!
అఖండ మహిమాన్విత దివ్యశక్తే!
ఖం సాయినాథ చరణం మమ శరణుశరణం ‖ 10

తాత్పర్యం· ఖండ యోగాసనము (శరీరంలోని భాగాలని వేరుచేయగలగటం) లో సామర్ధ్యం ఉన్నవాడా! ఖండోబా దేవతయొక్క యశస్సు నుంచి ఉదయించిన సాయి నామాన్ని ధరించినవాడా! (మహాళ్సాపతి అనే ఖండోబా దేవాలయ పూజారి సాయి అనే నామంతో మొట్టమొదట పిలిచాడుకదా!) అఖండమైన మహిమలతో కూడుకొని ఉన్న ఓ దివ్య శక్తి! ఓ ఖం (ఆకాశం) సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

దేవహంసే దేవహంసే శ్రీదత్తరూప పరమహంసే!
రామకృష్ణ సాయినాథ పరమహంసే దేవహంసే!
సాయినాథ రామకృష్ణ దేవహంసే పరమహంసే!
ఓం సాయినాథ చరణం మమ శరణుశరణం ‖ 11

తాత్పర్యం: శ్రీ దత్తాత్రేయుని స్వరూపాలుగా ఎంతోమంది మహామహిమాన్వితులైన గురువులు మానవరూపంలో ఉదయించారు. ఆ గురుచరిత్రలు చదివితే, వింటే వారి అవతారాలు సద్ధర్మస్థాపనకు, తమ శిష్యులను ఈ సంసార సాగరాన్ని అతిసులువుగా ఈదగలిగే ఆలోచనా శక్తిని, తుదకు ఆత్మసాక్షాత్కారాన్ని, మోక్షాన్నీ పొందే మార్గాలని తెలియజెయ్యటానికే అని మనకు బోధపడుతుంది.

గురువులు సామాన్య మానవులకు సర్వేశ్వరునకు అనుసంధానంగా ఉంటూ తమ శిష్యులను ఎల్లవేళలా కాపాడుతూ దైనందిన సామాజిక, ఆధ్యాత్మిక జీవనాల్లో మార్గదర్శకులుగా ఉంటారు.

**గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణు గురుదేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైత్ శ్రీ గురవేనమః**

శ్రీ షిరిడీ సాయిబాబా చరిత్రలో ఒకసారి సాయిబాబా మూడురోజులు నిర్జీవంగా, చలనరహితంగా ఉన్న తరువాత తిరిగిలేవటం, ఆయనే స్వయంగా రామకృష్ణ పరమహంస గురించి మాట్లాడటం, ఆ రోజే శ్రీ రామకృష్ణ పరమహంస సిద్ధిపొందటం మీఅందరికీ తెలిసిన విషయాలే. ఓం సాయి నాథా! నీ చరణాలే నాకు శరణు శరణం.

ఓం సాయిరాం ‖

**రచన: సమర్ధ సద్గురు శ్రీ సాయిబాబా ---- కలం: ప్రసాదు నిమ్మగడ్డ ---- సెప్టెంబరు 1, 2001**